# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని దక్షిణకోస్తా, రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.**
2. **ఆకస్మిక వరదల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.**
3. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమైంది.**
4. **రుతుపవనాల కారణంగా నిలిచిపోయిన ఇసుక తవ్వకాలను ఈరోజు నుంచి పున: ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది.**
5. **ఈరోజు ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని దక్షిణకోస్తా, రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వాయుగుండం వాయవ్య దిశగా గంటకు 10కి.మీ వేగంతో కదులుతున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. వాయుగుండం ప్రస్తుతం చెన్నైకి 440 కి.మీ, పుదుచ్చేరికి 460 కి.మీ, నెల్లూరుకి 530 కి.మీ దూరంలో కేంద్రీకృతమైనట్లు తెలిపింది. రేపు తెల్లవారుజామున చెన్నై, నెల్లూరు మధ్య తీరం దాటే అవకాశముందని పేర్కొంది. వాయుగుండం ప్రభావంతో ఈరోజు తిరుపతి, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో పలుచోట్ల విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి.

ప్రకాశం జిల్లాలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై మా ఆకాశవాణి ప్రకాశం జిల్లా ప్రతినిధి ఎం.వి.ఎస్.ప్రసాద్ మరింత సమాచారం అందజేస్తారు.

వాయిస్ (30 సెకన్లు)

-------------------------

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఆకస్మిక వరదల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల ప్రభావం అధికంగా ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు సహా పలు జిల్లాల అధికారులను అక్కడి పరిస్థితులపై వివరాలను, చేపట్టిన ముందస్తు చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వర్ష ప్రభావిత

జిల్లాల్లోని పరిస్థితులను ఎప్పటికప్పుడు నివేదించాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈ రోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో ప్రభుత్వ శాఖలు ప్రతిపాదించిన పలు కీలక అంశాలపై చర్చ జరుగుతోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో రుణాల రీషెడ్యూల్లో స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు, చెత్త పన్ను రద్దు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం, నూతన పారిశ్రామిక విధానం, కొత్త నగర పాలకసంస్థల్లో పోస్టుల భర్తీ తదితర అంశాలపై మంత్రివర్గం చర్చిస్తోందని అధికారులు తెలిపారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. చెన్నై –నెల్లూరు మధ్య తుఫాను తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేయడంతో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. జిల్లాలో వాతావరణ పరిస్థితిపై ఆకాశవాణి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రతినిధి ఎస్.అమర నారాయణరావు మరిన్ని వివరాలు అందజేస్తారు.

వాయిస్ ( 35 సెకన్లు)

---------------------------

తిరుమలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ మార్గంలో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా తిరుమల తిరుపతి దేవస్థానం–టిటిడి అధికారులు విరిగిపడిన కొండచర్యలను తొలగించారు. అలాగే తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దుచేసిన టిటిడి... వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తిరుమలలోని శ్రీవారి పాదాలు, ఆకాశ గంగ, జాపాలి, పాపవినాశనానికి టిటిడి అధికారులు భక్తుల అనుమతిని నిలిపివేసింది.

---------------------------

విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో అతిసార వ్యాధితో రెండు రోజుల్లో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిన్న ఒక్కరోజే నలుగురు మృతి చెందిన నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో బాధితులకు తగిన వైద్య సహాయం అందించాలని, గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఇది ఇలా ఉండగా.. అతిసార వ్యాధి వ్యాపించిన గ్రామాన్ని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గ్రామంలో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నామని, ఇప్పటికే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, బాధితులకు వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

---------------------------

రుతుపవనాల కారణంగా నిలిచిపోయిన ఇసుక తవ్వకాలను ఈరోజు నుంచి పున: ప్రారంభించేందుకు

రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. జూన్ ఒకటి నుంచి ఈనెల 15వ తేది వరకు నదుల్లో ఇసుక తవ్వకాన్ని నిలిపివేసిన అధికారులు ఈ రోజు నుంచి నదుల్లో తవ్వకాలకు అనుమతిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి ఇసుక సరఫరా చేస్తున్నందున వారం నిల్వలన్నీ ఒకేసారి బుక్ అవుతున్న క్రమంలో ఈరోజు నుంచి 50 శాతం నిల్వలు ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు కేటాయిస్తున్నామని అధికారులు తెలిపారు. మిగిలిన 50 శాతం ఇసుకను నేరుగా విక్రయించనున్నామని పేర్కొన్నారు.

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందజేయడం, ఆహార వృథాను అరికట్టడం వంటి అంశాల పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈరోజు ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహిస్తున్నారు. పెరుగుతున్న ప్రపంచ జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తిని పెంచడం, పోషకాహార ప్రమాణాలను కాపాడడం, ఆహార వ్యర్థాలను అరికట్టడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1945 అక్టోబర్ 16వ తేదీన ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ ఏర్పాటైన సందర్భాన్ని పుస్కరించుకుని ప్రతి ఏటా ఈరోజు ఆహార దినోత్సవం జరుగుతోంది.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతులు బీసీల రక్షణ చట్టం విధివిధానాల రూపకల్పనపై చర్చించేందుకు బీసీ మంత్రులతో ఈరోజు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత ఒక ప్రకటనలో తెలిపారు. చట్టం రూపకల్పనపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో 8 మంది బీసీ మంత్రులతో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. చట్టం విధివిధానాల రూపకల్పనపై చర్చించి, సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని మంత్రి తెలిపారు.

---------------------------

నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని శ్రీకాకుళం జిల్లా సంయుక్త కలెక్టర్ ఫార్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. శ్రీకాకుళంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ కమిటీ ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తుందని చెప్పారు. దుకాణాదారులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు వస్తువులను విక్రయంచాలని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పండించే ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు ఈ-పంటలో నమోదు చేసుకోవాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్దేశించిన 'పల్లె పండుగ' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం హర్షణీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా ఆయన స్పందిస్తూ రాష్ట్రంలోని 13 వేల 326 గ్రామాల్లో మొత్తం 30 వేల పనులు చేపట్టాలనే పెద్ద కార్యక్రమాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ఆయన అభినందించారు. 4 వేల 5 వందల కోట్ల రూపాయలతో చేస్తున్న అభివృద్ధి పనుల ద్వారా గ్రామాల్లో ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర హైకోర్టులో న్యాయవాదులుగా సేవలందిస్తున్న కె మహేశ్వరరావు, టి. చంద్ర ధనశేఖర్, సిహెచ్ గుణరంజన్‌లను అదే హైకోర్టులో న్యాయమూర్తులుగా నియమించడానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్‌లతో కూడిన కొలీజియం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు తాజాగా చేసిన సిఫారసులకు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేస్తే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తుల సంఖ్య 29కి చేరుతుంది.

======================